నాలుగు పథకాల అమలుకు.... లబ్ధిదారుల ఎంపికే అసలు పరీక్ష ..

# నేటి నుంచి గ్రామ సభలు

- సొంత జాగాలేని వారికి ఇందిరమ్మ ఇళ్లు..
- ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీకి రంగం సిద్ధం
- దరఖాస్తు దారుల్లో చిగురిస్తున్న ఆశలు



సంక్షేమ పథకాల పరిశీలనలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో (ఆంధ్రప్రభ)

గణతంత్ర దినోత్సవ కానుకగా రాష్ట్రప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాల అమలుకు పకడ్బందీ ప్రణాళికతో కార్యాచరణ సిద్ధం చేసింది. లబ్దిదారుల ఎంపిక కోసం ఊరురా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించిన అధికారులు ఇక నాలుగు పథకాల్లో అర్హులైన వారిని లెక్క తేల్చేందుకు మంగళవారం నుండి షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించనున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటికే సమావేశాలు, సమీక్షలు, సర్వేలు నిర్వహించి అర్హుల జాబితా ఎంపికకు రంగం సిద్ధం చేశారు. ఈనెల 26న రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా రైతు భరోసా, కౌలు రైతులకు ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు. మంగళవారం నుండి చేపట్టే గ్రామ సభలకు ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇటు గ్రామాల్లో, మరోవైపు మున్సిపల్ వార్డుల్లో సమయపాలన ఖచ్చితగా నిర్వహించేలా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. గ్రామసభల్లో వచ్చే ఫిర్యాదులపై రిజిష్టర్లు ఏర్పాటు చేసి అర్జిలను స్వీకరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా అర్హులైన పేదల జాబితాను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

### పేదవర్గాల్లో చిగురిస్తున్న ఆశలు

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో అర్హులైన పేదల్లో కొత్త ఆశలకు జీవం పోస్తున్నాయి. ప్రజాపాలనలో ఇళ్లు లేని వారు, సొంత జాగా ఉండి నిలువ నీడ లేని వారు, అదేవిధంగా రేషన్ కార్డులేని కుటుంబాలు, నిరుపేద కౌలు రైతులు, మరోవైపు రైతు భరోసా పథకం కోసం ఎదురు చూస్తున్న రైతులకు తొలి విడతలో సంక్షేమ ఫలాలు అందనున్నాయి. లబ్దిదారుల ఎంపికలో 4 రోజుల పాటు నిర్వహించే గ్రామసభలే కీలకం కానున్నాయి.

### ఇందిరమ్మ అర్హుల జాబితా రెడీ

ఇళ్లు లేని నిరుపేదల కల ఇక నెరవేరే అవకాశం ఉంది. దశల వారిగా ఇళ్లను మంజూరు చేసేందుకు సర్వే ద్వారా అర్హుల జాబితాను సిద్ధం చేశారు. మంగళవారం నుండి జరిగే గ్రామ, వార్డు సభల్లో ఆమోదం పొందిన తర్వాతే ఇందిరమ్మ పేరిట తొలివిడుతగా ఇళ్లు మంజూరు చేయనున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇంటికోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి క్షేత్రస్తాయిలో యాప్ ద్వారా సర్వే నిర్వహించారు. ఇంటి పరిస్థితి ఎలా ఉంది. పూరిపాకలు, మట్టి ఇళ్లు, జిఐ షీట్‌తో కప్పి ఉన్న ఇళ్లు, బండలు మట్టితో కట్టిన ఇళ్లు, అద్దె ఇళ్లలో ఉన్నవారి వివరాలను సేకరించారు. లబ్దిదారుతో పాటు ఇంటి ఫోటోలను కూడ తీసుకుని సూపర్ సర్వే నిర్వహించి జాబితాను సిద్ధం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం ప్రజాపాలనలో 1,99,803 దరఖాస్తులు రాగా, 1,67,910 సర్వే నిర్వహించారు. వీటిలో సొంత జాగా ఉండి ఇళ్లు లేని వారు జిల్లాలో 63,642గా తేల్చారు. తొలివిడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

### సొంతజాగాలేనివారికి 'డబుల్' ఇళ్లు

సొంత జాగా లేని అఅర్హులైన పేదలకు ఇందిరమ్మ పేరిట డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలను ఇందిరమ్మ పథకంలో చేర్చాలని, పూర్తయిన ఇళ్లతో పాటు అసంపూర్తిగా ఉన్న ఇళ్లను సిద్ధం చేసి లబ్దిదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ నెల 21 నుండి ఊరురా గ్రామసభలు నిర్వహించి లబ్దిదారుల జాబితాను ప్రదర్శించనున్నారు. మహిళల పేరు మీదే పథకాలను మంజూరు చేయనున్నారు.



ఇందిరమ్మ ఇల్లు

### ఉపాధి హామి కూలీలకే ఆత్మీయ భరోసా

ఉపాధిహామి పనులకు కనీసం 20 రోజులు వెళ్లిన జాబ్ కార్డుదారులు ఉన్నవారికి ఆత్మీయ భరోసా కింద ఎంపిక చేయనున్నారు. భూములు లేని రైతు కూలీలకు ఏడాదికి 12వేల చొప్పున రైతు భరోసా సహాయం అందించనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జాబ్‌కార్డులుండి భూమి లేని నిరుపేద కూలీలుమూడులక్షల పైనే ఉన్నట్లు తేల్చారు. ఆదిలాబాద్ జిల్లాలో 84,805, మంచిర్యాల జిల్లాలో 57,608, కొమరంభీం జిల్లాలో 70618, నిర్మల్ జిల్లాలో 1,07679 మంది కూలీలు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. లబ్దిదారుల ఎంపిక, మంజూరు కోసం కసరత్తు సాగిస్తున్నారు.

### కొత్తరేషర్ కార్డులపై చిగురిస్తున్న ఆశలు

రేషన్ కార్డుల కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్ష 50వేల పైనే దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన, కులగణన సర్వేతో పాటు గత పదేళ్లలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు ఈనెల 26న తొలివిడుతగా రేషన్ కార్డులు మంజూరు చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్యేక సర్వే ద్వారా ఇంటింటికి వెళ్లి జాబితాను సేకరించారు. ఈజిల్లాలో 18741 కుటుంబాలకు అర్హులుగా గుర్తించి గ్రామ వార్డు సభల్లో ఆమోదం పొందిన తర్వాత కొత్త కార్డులు అందించనున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో 1,92,078 కుటుంబాలకు ఆహార భద్రతా కార్డులుండగా ఆరుఏళ్లుగా కొత్తకార్డులు లేకపోవడం, పెళ్లైన కొత్త కుటుంబాలకు కూడ రేషన్ కార్డులు అందించనున్నారు. అయితే పాత కార్డులను మాత్రం రద్దు చేయడం లేదని తెలిసింది. నిరంతర ప్రక్రియగా రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనెల 21 నుండి 24వరకు నిర్వహించే గ్రామసభలు, లబ్దిదారుల ఎంపిక అధికార యంత్రాంగానికి అగ్ని పరీక్షగా మారనుంది.

## రైతు కుటుంబానికి పరామర్శ

**ఆదిలాబాద్ రూరల్, జనవరి 20(ఆంధ్రప్రభ ):** బ్యాంక్ అధికారుల వేధింపులతో ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంకులో పురుగుల మందు తాగి రైతు జాదవ్ దేవరావు మృతి చెందడం బాధాకరమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం బేల మండలం రేణు గూడా గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు.రైతు ఆత్మహత్య సంఘటనకు బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలని అన్నారు.విషయాన్నీ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఆదుకుంటామని,ప్రభుత్వపరంగా బాధిత రైతు కుటుంబానికి అందాల్సిన పరిహారం వెంటనే అందేలా చూస్తామని కుటుంబ సభ్యులకు శ్రీకాంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేముల నాగరాజ్, నాయకులు సామ రూపేష్ రెడ్డి,నలిమెల నవీన్ రెడ్డి, ఇర్ఫాన్, అభిబ్,అలీమ్ తదితరులు వున్నారు.



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకుడు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

## ఆదివాసులకు రాజ్యాంగహక్కులు కల్పించాలి

**ఉట్నూర్, జనవరి 20 (ఆంధ్రప్రభ )** రాజ్యాంగ బద్ధంగా ఆదివాసీలకు కల్పించిన హక్కులను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ ఐటిడిఎ కార్యాలయం ముందు ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాలతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని జివో 3తోపాటు గిరిజన శాఖలోని 29 జీవోలను కలిపి వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. ఆదివాసులకుఅమలు చేస్తున్న చట్టాలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసులకు పోడు భూముల పట్టాలివ్వాలని, ఏజెన్సీ డిఎస్సీ వేసి ఎజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగులను ఆదివాసీ అభ్యర్థులతోనే బర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పాఠశాలలో పనిచేస్తున్న గిరిజనేతర సిఆర్‌టిలను వెంటనే తొలిగించాలని, ప్రస్తుతం ఉన్నజోనల్‌వ్యవస్థ వల్ల ఆదివాసులకు తీరని అన్యాయం జరుగుతుందని, ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతంలో కలిపి ప్రత్యేక జోన్ ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 317 ద్వారా ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయి ఉద్యోగాలు చేస్తున్న గిరిజనేతర ఉద్యోగస్థులను మైదాన ప్రాంతాలకు పంపాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎపిఓ వసంత్ రావ్‌కు అందించారు. ఈ ధర్నాలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ కొమరంభీం జిల్లా అద్యక్షులు మడావి మనోహర్, ఎఐఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్రం నీలకంఠ్, రాష్ట్ర సమీక్ష కార్యదర్శి కొట్నాక్ భీంరావ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు, మండలాల నాయకులు సభ్యులు పాల్గొన్నారు.




ధర్నాలో పాల్గొన్న ఆదివాసి నాయకులు, కార్యకర్తలు

## గుబిడి గ్రామానికి బస్సు సౌకర్యం

**భీంపూర్, జనవరి 20 (ఆంధ్రప్రభ ):** తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని ప్రవేట్ వాహనాలతో ఇబ్బంది ఎదుర్కొంటున్నామని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు మండలంలోని గుబిడి గ్రామస్థులు విన్నవించారు ఆర్టీసీ అధికారి తో మాట్లాడి బస్సు వచ్చే విధంగా కృషి చేశారు. సోమ వారం గ్రామానికి బస్సు రావడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.



## నిర్విరామంగా కొనసాగుతున్న అన్నదానం

**ఉట్నూర్ రూరల్, జనవరి 20(ఆంధ్రప్రభ ):** ఐటిడిఏ కార్యాలయం ఎదుట గత మూడు సంవత్సరాల నుండి బొజ్జన్న బువ్వ అన్నదాన సత్రం నిర్విరామంగా కొనసాగుతుంది. ఈ అన్నదాన సత్రం సూదుర ప్రాంతాల నుండి వచ్చే పేద ప్రజల ఆకలిని తీర్చేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ మోబిన్ పేర్కొన్నారు.ఈ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగపల్లి చంద్రయ్య, జిల్లా ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, యూత్ కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అరికిళ్ల పరమేశ్వర్,ఎస్సి సెల్ మండల అధ్యక్షులు అచ్చ దేవానందం,సామాజిక కార్యకర్త మెస్రం జైవంత్,యూత్ కాంగ్రెస్ నాయకుడు సల్లు భాయ్, కలిం పాషా,అక్షయ్, నందు తదితరులు


**శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం : 501, సల్‌కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ - 110025
సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్‌సి366027

**వేలం ప్రకటన**

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికి వారిచే సర్దుబాటు చేయబడలేదు రుణగ్రహీతలందరికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలు పొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా 30 జనవరి, 2025న మ॥03.00గం॥లకు వేలం తేదీగా నిర్ణయించబడినది. రుణగ్రహీతలతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

| క్ర. సం. | శాఖ | ఖాతా నెం. | ఖాతాదారుని పేరు | తండ్రి/ భర్త లేదా భార్య పేరు | చిరునామా | ఖాతా తెరచిన తేది | చెల్లించవలసిన మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | జూబ్లీహిల్స్ | 103942510827 | గెడం ఏ కుమార్ | తండ్రి గెడం రతన్ | 10-114/2, మసాదే రతన్, ఆసిఫాబాద్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, తెలంగాణ - 504293 | 21-03-2024 | 36,095.20 |

**వేలం తేది : 30 జనవరి 2025న మ॥03.00గం॥లకు**

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.
సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్